సాక్షి ఖమ్మం

శనివారం ı 6 ı సెప్టెంబర్ ı 2025



రూ.350కోట్లతో ప్రతిపాదనలు

భద్రాచలంలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయాన్ని రూ.350 కోట్లతో అభివృద్ధి చేసేలా ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. 8లో



నిమజ్జనానికి ఏర్పాట్లు పూర్తి

నవరాత్రులు పూజలు అందుకున్న వినాయక విగ్రహాలను శనివారం నిమజ్జనం చేయనుండగా ఏర్పాట్లు పూర్తిచేశారు. 8లో

గరిష్ఠం / కనిష్ఠం
32° / 24°

వాతావరణం

జిల్లాలో శనివారం గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముంది. ఉదయం నుంచే మొదలయ్యే ఎండ మధ్యాహ్నానికి పెరుగుతుంది.

న్యూస్‌రీల్

నేడు మంత్రి తుమ్మల పర్యటన

ఖమ్మంఅర్బన్: రాష్ట్ర వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు శనివారం ఖమ్మం నగరంతో పాటు రఘునాథపాలెం మండలంలో పర్యటించనున్నారు. ఉదయం ఖమ్మంలోని ధంసలాపురం వద్ద గ్రీన్‌ఫీల్డ్ హైవే ఎగ్జిట్–ఎంట్రీ పనులు, ఆర్‌ఓబీ నిర్మాణ పనులను మంత్రి పరిశీలిస్తారు. అలాగే, మధ్యాహ్నం గాంధీచౌక్‌లో గణేశ్ విగ్రహాల శోభాయాత్రను ప్రారంభిస్తారు. ఇక సోమవారం రఘునాథపాలెం మండలం వి.వెంకటాయపాలెంలో వెటర్నరీ సబ్ సెంటర్ భవనం, ప్రహరీ, బీసీ హాస్టల్ భవన నిర్మాణాలతో పాటు మధ్యాహ్నం ఖమ్మం రోటరీనగర్‌లో రహదారులు, డ్రెయిన్ల నిర్మాణాలకు మంత్రి శంకుస్థాపన చేయనున్నారు.

‘ఆపదమిత్ర’లుగా శిక్షణ

ఖమ్మం రాపర్తినగర్: నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ, మేరా యువ భారత్ ఆధ్వర్యాన యువతకు ‘ఆపదమిత్ర’లుగా శిక్షణ ఇవ్వనున్నట్లు నెహ్రూ యువక కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ చింతల అన్వేష్ తెలిపారు. వరదలు, భూకంపాలు తదితర విపత్కర పరిస్థితుల్లో సహాయక చర్యలు చేపట్టే భద్రతా దళాలకు అండగా నిలిచేలా యువతకు శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. ఖమ్మంలో వారం పాటు జరిగే శిక్షణలో పాల్గొన్న వారికి ఎమర్జెన్సీ కిట్‌తో పాటు సర్టిఫికెట్ అందిస్తామని తెలిపారు. జిల్లా వాసులై 18–40 ఏళ్ల వయస్సు కలిగి కనీస విద్యార్హత ఉన్న యువత ఈనెల 8వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు ఖమ్మం పాత బస్టాండ్ సమీపంలోని మై భారత్ కార్యాలయం(నెహ్రూ యువ కేంద్రం)లో లేదా 99517 45203 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

నిమజ్జన ఘాట్లు పరిశీలించిన అడిషనల్ డీసీపీ



ఘాట్ వద్ద పరిశీలిస్తున్న ప్రసాదరావు

ఖమ్మంక్రైం: జిల్లా కేంద్రంలో గణేష్ విగ్రహాల నిమజ్జనం శనివారం జరగనుండగా ఘాట్ల వద్ద ఏర్పాట్లను శుక్రవారం అడిషనల్ డీసీపీ ప్రసాదరావు పరిశీలించారు. కాల్వొడ్డు, ప్రకాశ్‌నగర్, ఖమ్మం రూరల్ మండలం పెద్దతండా వైపు మున్నేటి తీరాన నిమజ్జనం ఘాట్లను పరిశీలించిన ఆయన ఏర్పాట్లు, భద్రతపై సూచనలు చేశారు. అలాగే, వాహనాల రాకపోకలకు ఇక్కట్లు ఎదురుకాకుండా బందోబస్తు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు.

నేడు ఓటర్ల ముసాయిదా జాబితా ప్రకటన

ఖమ్మం సహకారనగర్: రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు శనివారం జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల్లో ఓటర్ల ముసాయిదా జాబితాను విడుదల చేయనున్నారు. ఈ జాబితాలను మండల పరిషత్ కార్యాలయాలతో పాటు జిల్లా పరిషత్ కార్యాలయంలో ప్రదర్శిస్తారు. ఈ జాబితా ఆధారంగా జిల్లాలో 8,02,690మంది ఓటర్లు ఉన్నట్లు తెలుస్తుండగా, పోలింగ్ బూత్‌ల సంఖ్య 1,572 నుంచి 1,580కి పెరగనుంది. ఆతర్వాత అభ్యంతరాలు స్వీకరించి పరిశీలన అనంతరం ఓటర్ల తుది జాబితా విడుదల చేస్తారు.

జాతీయ స్థాయి పోటీలకు ‘కస్తూరి తిలకం’

మధిర: ఏపీలోని తెనాలిలో కళల కాణాచి సంస్థ ఆధ్వర్యాన ఈనెల 27 నుంచి అక్టోబర్ 2 వరకు జాతీయ స్థాయి పద్య నాటక పోటీలు జరగనున్నాయి. ఈ పోటీల్లో పాల్గొనేందుకు మధిర కళాకారులు రూపొందించిన కస్తూరి తిలకం పద్య నాటకం ఎంపికైంది. ఈ నాటకాన్ని శారదాప్రసన్న రచించగా, డాక్టర్ సుబ్బరాజు దర్శకత్వంలో ప్రదర్శించనున్నారు. వివిధ పాత్రలను చిలువేరు శాంతయ్య, ఇనుపనూరి వసంత్, నరాల సాంబశివారెడ్డి, రాజేశ్వరరావు, తిరువూరు ప్రసాద్, కోటిరెడ్డి పోషిస్తారు. జిల్లా నుంచి రెండు నాటకాలను పరిశీలించగా కస్తూరి తిలకం ఎంపికైందని సుమిత్ర యూత్ ప్రధాన కార్యదర్శి సుబ్బరాజు తెలిపారు.



ఆమోదిస్తే సవరణే...

- మార్కెట్ విలువతో పోలిస్తే భూమి రిజిస్ట్రేషన్ ధరలో హెచ్చుతగ్గులు
- దీన్ని సవరించేలా గత ఏడాది కమిటీల ఏర్పాటు
- ప్రతిపాదనలను ప్రభుత్వానికి సమర్పించిన రిజిస్ట్రేషన్ల శాఖ
- సీఎం సూచనలతో అమలైతే ఉమ్మడి జిల్లాలోనూ ప్రభావం

సాక్షిప్రతినిధి, ఖమ్మం: వ్యవసాయ, వ్యవసాయేతర భూముల మార్కెట్ విలువ సవరణ అంశం మళ్లీ తెరపైకి వచ్చింది. గత ఏడాది జూన్‌లో ధరల సవరణకు ప్రభుత్వం కమిటీలను నియమించింది. స్టాంపులు రిజిస్ట్రేషన్ శాఖ, రెవెన్యూ అధికారులతో ఏర్పాటైన ఈ కమిటీలు అన్ని జిల్లాలతో పాటు ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనూ భూముల విలువ సవరణకు ఉన్న అవకాశాలపై ప్రభుత్వానికి నివేదించారు. ఆతర్వాత ప్రక్రియ నిలిచిపోయింది. గతనెలలో ఓఆర్‌ఆర్ లోపల, వెలుపల 20 మున్సిపాలిటీలు, ఏడు కార్పొరేషన్లు, జీహెచ్‌ఎంసీ పరిధిలోనే విలువ సవరణ ప్రతిపాదనలను స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ రూపొందించింది. కానీ రాష్ట్రమంతటా సవరించాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించడంతో గత ఏడాది పంపిన ప్రతిపాదనల మేరకు పెంచేలా కసరత్తు మొదలుపెట్టినట్లు సమాచారం.

రెండేసి కమిటీలు

ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పలు ప్రాంతాల్లో కొన్నేళ్లుగా బహిరంగ మార్కెట్‌లో భూముల ధరలు పెరుగుతున్నాయి. ప్రభుత్వ ధరలతో పోలిస్తే బహిరంగ మార్కెట్ విలువ నాలుగైదు రెట్లు ఎక్కువగా ఉంది. గతంలో అత్యధిక ధర ఉన్న ప్రాంతాల్లో ప్రస్తుతం మార్కెట్ విలువ స్తబ్దుగా ఉంది. వీటిని సవరించేందుకు గత ఏడాది జూన్‌లో కమిటీలను ఏర్పాటు చేశారు. గ్రామీణ కమిటీలకు ఆర్డీఓ చైర్మన్‌గా, తహసీల్దార్, ఎంపీడీఓ, మార్కెట్ వాల్యూ సబ్ రిజిస్ట్రార్లు సభ్యులుగా, స్థానిక సబ్ రిజిస్ట్రార్‌ను కన్వీనర్‌గా ఉన్నారు. అర్బన్ కమిటీలకు అదనపు కలెక్టర్(రెవెన్యూ) చైర్మన్‌గా, జెడ్పీ సీఈఓ, మున్సిపల్ కమిషనర్, సుడా వైస్ చైర్మన్లు సభ్యులుగా, స్థానిక సబ్ రిజిస్ట్రార్‌ను కన్వీనర్‌గా నియమించి పరిశీలన చేయించారు.

ప్రభుత్వానికి నివేదికలు

కమిటీలు పలు ప్రాంతాల్లో ధరల్లో తేడాలను పరిశీలించాయి. ఉమ్మడి జిల్లాలోని 11 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో భూముల విలువ సవరణ కోసం ప్రతిపాదనలను గత ఏడాది జులైలో ప్రభుత్వానికి పంపారు. ఉమ్మడి జిల్లాలోని ఏజెన్సీ, మైదాన ప్రాంతాల్లో ప్రస్తుత మార్కెట్ విలువ, బహిరంగ మార్కెట్ విలువ ఆధారంగా కొన్నిచోట్ల పెంపు, ఇంకొన్ని చోట్ల తగ్గింపునకు ప్రతిపాదించారు. వీటి ప్రకారం ఖమ్మం చుట్టు ప్రక్కల ప్రాంతాల్లో భూ ధరలు భారీగా పెరిగే అవకాశముంది. కమర్షియల్ ప్రాంతాలను పక్కాగా గుర్తించి ధరలు పెంచేలా ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతిపాదనలు సమర్పించారు.

పూర్తిస్థాయి పరిశీలన కోసం..

భూముల మార్కెట్ విలువ సవరణపై ప్రభుత్వానికి నివేదిక అందాక ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. అయితే, రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జిల్లా రిజిస్ట్రార్లు, సబ్ రిజిస్ట్రార్లతో సమావేశం నిర్వహించారు. ధరల పెంపు మరింత పారదర్శకంగా ఉండాలని, ఎక్కడా వ్యత్యాసాలు ఉండకూడదని ఆదేశించారు. దీంతో ప్రతిపాదనలను పూర్తిస్థాయిలో పరిశీలించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా కర్ణాటకలో పరిశీలనకు ఓ కమిటీ వెళ్లగా.. అందులో జిల్లా రిజిస్ట్రార్ కూడా ఉన్నారు.

ప్రతిపాదనలకే సై...

ఉమ్మడి జిల్లాలో భూముల మార్కెట్ విలువ సవరణపై అందిన ప్రతిపాదనలను ఆమోదించే అవకాశముందని తెలుస్తోంది. తద్వారా ఖమ్మం కలెక్టరేట్ ప్రాంతంలోని రఘునాథపాలెం మండలం వి.వెంకటాయపాలెం, చింతకాని మండలం వందనం, కొణిజర్ల మండలం తనికెళ్ల, అమ్మపాలెం రెవెన్యూ పరిధిలో వ్యవసాయ, వ్యవసాయేతర భూముల విలువ భారీగా పెరిగే అవకాశముంది. ఉమ్మడి జిల్లాలోని పలుచోట్ల ప్రభుత్వ, బహిరంగ మార్కెట్ ధర ఆధారంగా అన్నిరకాల భూముల ధరలు 50 శాతం వరకు పెరగొచ్చని భావిస్తున్నారు. కాగా, బహిరంగ మార్కెట్ ధరకు దగ్గరగా ఉన్న చోట్ల మాత్రం యథావిధిగా కొనసాగించాలనే ఆలోచనకు వచ్చినట్లుగా తెలుస్తోంది.

జిల్లాలో పలుచోట్ల ధరల పెంపు ప్రతిపాదనలు

→ **ఖమ్మం ఖమ్మం జాయింట్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిధి :** నివాస ప్రాంతాల్లో గజం కనీస ధర రూ.2,100 ఉండగా రూ.3వేలకు, గరిష్ఠ ధరను రూ.26,400 నుంచి రూ.26,500కు పెంచాలని ప్రతిపాదించారు.

- వాణిజ్య ప్రాంతాల్లో కనీస ధరను రూ.4,800 నుంచి రూ.10 వేలకు, గరిష్ఠ ధర రూ.44,900నుంచి రూ.45,000కు పెంచేలా ప్రతిపాదనలు సమర్పించారు.
- అపార్ట్‌మెంట్లలో చదరపు అడుగు కనీస ధరను రూ.2వేలు యథాతథంగా కొనసాగించాలని, గరిష్ఠ ధరను రూ.3,500 నుంచి రూ.3,800కు పెంచాలని పేర్కొన్నారు.
- వ్యవసాయ భూముల ఎకరా కనీస ధరను రూ.6.75లక్షల నుంచి రూ.10 లక్షలకు, గరిష్ఠ ధరను రూ.2,43,75,000 నుంచి రూ.2.90కోట్లకు పెంచాలని ప్రతిపాదించారు.

→ **ఖమ్మం రూరల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం :** నివాస ప్రాంతాల్లో గజం కనీస ధరను రూ.300 నుంచి రూ.500కు, గరష్ఠ ధరను రూ.4,800 నుంచి రూ.5 వేలకు పెంచాలని ప్రతిపాదించారు.

- వాణిజ్య ప్రాంతాల్లో కనీస ధర రూ.1,100 నుంచి రూ.2 వేలకు, గరిష్ఠ ధర రూ.5,800 నుంచి రూ.10 వేలకు పెంచాలని పేర్కొన్నారు.
- ఆపార్ట్‌మెంట్లలో కనీస ధర రూ.1,300ను కొనసాగిస్తూ, గరిష్ఠ ధరను రూ.1,500 నుంచి రూ.2 వేలకు పెంచాలని సూచించారు.
- వ్యవసాయ భూముల ఎకరా కనీస ధరను రూ.2.25 లక్షల నుంచి రూ.5,లక్షలకు, గరిష్ఠ ధరను రూ.1,18,58,000 నుంచి రూ.1.30 కోట్లకు పెంచాలని ప్రతిపాదించారు.

→ **సత్తుపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం :** నివాస ప్రాంతాల్లో గజం కనీస ధర రూ.700 నుంచి రూ.900కు, గరిష్ఠ ధర రూ.4,100 నుంచి రూ.5 వేలకు పెంచొచ్చని ప్రతిపాదించారు.

- వాణిజ్య ప్రాంతాల్లో కనీస ధర రూ.4,800 నుంచి రూ.6 వేలకు, గరిష్ఠ ధర రూ.19,600 నుంచి రూ.25వేల మేర పెంపునకు ప్రతిపాదించారు.
- అపార్ట్‌మెంట్లలో కనీసధర రూ.1,300 నుంచి రూ.1,500కు, గరిష్ఠ ధర రూ.2,500 నుంచి రూ.3వేలకు పెంచేలా పేర్కొన్నారు.
- వ్యవసాయ భూమి ఎకరా కనీస ధర రూ.3,37,500 నుంచి రూ.4,లక్షలకు, గరిష్ఠ ధరను రూ.91.48 లక్షల నుంచి రూ.2 కోట్లకు ప్రతిపాదించారు.

‘స్వగృహ’ మాకే కావాలి!



ప్రస్తుతం రాజీవ్ స్వగృహ బ్లాక్‌లు



అభివృద్ధి చేసిన తర్వాత ఇలా..

- ఫ్లాట్ల కోసం వ్యాపారుల పోటాపోటీ
- ఇప్పటికే కొనుగోళ్లకు ఉద్యోగుల నిర్ణయం
- అన్నీ సవ్యంగా ఉండడంతో వ్యాపారుల దృష్టి

ఖమ్మం సహకారనగర్: ఎన్నో ఏళ్ల అనంతరం సొంత ఇంటి కల నెరవేరుతుందనే ఆశతో ప్రభుత్వ ఉద్యోగులు ఉండగా... వారి ఆశలను అడియాసలు చేసేలా కొందరు వ్యాపారులు ప్రయత్నిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఖమ్మం రూరల్ మండలం పోలేపల్లిలో ఏళ్ల క్రితం రాజీవ్ స్వగృహ పేరిట నిర్మాణం మొదలుపెట్టిన అపార్ట్‌మెంట్ల నిర్మాణం మధ్యలోనే నిలిచిపోయింది. ఆతర్వాత ఎవరూ పట్టించుకోలేదు. సుమారు ఏడేళ్లుగా ఉన్నవి ఉన్నట్లుగా తమకు కేటాయిస్తే మిగతా నిర్మాణం చేసుకుంటామని ఉద్యోగ సంఘాల ఆధ్వర్యాన పలు మార్లు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, చివరకు ముఖ్యమంత్రిని సైతం కలిశారు. ఈ వినతిపై ఇటీవలే స్పందన రావడంతో ఒక్కో అడుగు ముందుకు పడుతుండగానే రియల్ ఎస్టేట్ వ్యాపారులు రంగంలోకి దిగడం వారిని ఆందోళనకు గురిచేస్తోందని సమాచారం.

హౌసింగ్ పీడీ పరిశీలన

రాజీవ్ స్వగృహ ఫ్లాట్లను ఉద్యోగులకు నిర్ణీత ధరతో కేటాయించేందుకు ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన వచ్చింది. దీంతో ఉద్యోగ సంఘాల ఆధ్వర్యాన సమావేశమై ఫ్లాట్ల ధర చదరపు అడుగుకు రూ.1,150గా నిర్ణయించారు. అదే అభివృద్ధి చేశాక రూ.2,500గా ఖరారు చేశారు. అంతేకాక అభివృద్ధి తర్వాత రాజీవ్ స్వగృహ ప్రాంగణం ఎలా మారనుందో బ్రోచర్లు ముద్రించారు. ఈక్రమంలోనే హౌసింగ్ పీడీ వీ.పీ.గౌతమ్ ఇటీవల పరిశీలించి సూచనలు చేశారు. ఆపై కలెక్టర్ అనుదీప్ కూడా సమీక్షించి రాజీవ్ స్వగృహ ప్రాంగణాన్ని ఉన్నది ఉన్నట్లుగా తెలంగాణ ఉద్యోగుల హౌస్ బిల్డింగ్ సొసైటీకి కేటాయిస్తామని ప్రకటించారు.

తొలి దఫాగా రూ.5కోట్లు

రాజీవ్ స్వగృహ ఫ్లాట్ల కోసం తొలిదశలో ప్రభుత్వానికి రూ.5కోట్లు చెల్లించాల్సి ఉండడంతో నగదు సేకరణలో ఉద్యోగ సంఘాలు నిమగ్నమయ్యాయి. అలాగే, కలెక్టర్ సమీక్ష సందర్భంగా మున్నేటికి ఇరువైపులా రిటైనింగ్ వాల్ నిర్మిస్తున్నందున వరద నుంచి ఎలాంటి ముప్పు ఉండదని, బఫర్ జోన్ కాకపోవడంతో భవిష్యత్‌లోనూ ఇబ్బందులు ఉండవని తెలిపారు. దీంతో ఉద్యోగులు ఫ్లాట్లు బుక్ చేసుకునేందుకు ఆసక్తి కనబరిచారు.

అప్పుడు వద్దు.. ఇప్పుడు కావాలి

గతంలో రెండు సార్లు రాజీవ్ స్వగృహను వేలం వేయగా ఏ ఒక్క వ్యాపారి ముందుకు రాలేదు. కనీసం టెండర్లు కూడా దాఖలు చేయలేదు. కానీ మున్నేటికి ఇరువైపులా రిటైనింగ్ వాల్ నిర్మిస్తుండడం, నిర్మాణ ప్రాంతం బఫర్ జోన్ పరిధిలోకి రాదని ఏకంగా కలెక్టర్ ప్రకటించడంతో రియల్ ఎస్టేట్ వ్యాపారులు ముందుకొస్తున్నట్లు సమాచారం. ఉద్యోగ సంఘాల ఆధ్వర్యాన నిర్మించిన బ్రోచర్లు కూడా ఆకట్టుకునేలా ఉండడంతో వ్యాపారులే సముదాయాన్ని దక్కించుకుని అభివృద్ధి చేశాక అధిక ధరలో అమ్ముకోవాలనే ఆలోచనకు వచ్చినట్లు తెలిసింది. అయితే, ఏళ్ల అనంతరం సొంతింటి కల నెరవేరుతుందనే ఆశతో ఉన్న ఉద్యోగులు ఈ ప్రచారంతో ఆందోళన చెందుతుండగా.. ఎవరూ స్పష్టత ఇవ్వలేకపోతున్నారు.

రాజీవ్ స్వగృహ వివరాలు

స్థలం	9.22ఎకరాలు
ఫ్లాట్లు	576
అంతస్తులు	09
బ్లాక్‌లు	08
2 1/2 బెడ్ రూమ్‌లు ఫ్లాట్లు	288
3 బెడ్ రూమ్	288

ఇకపై పీఏసీఎస్‌ల ద్వారానే..

- డీలర్ల ద్వారా యూరియా పంపిణీ నిలిపివేత
- రైతుల ఇబ్బందుల నేపథ్యాన ప్రభుత్వ నిర్ణయం
- జిల్లాలోని పాలేరు నియోజకవర్గంలో ఇప్పటికే అమలు



పందిళ్లపల్లి రేక్ పాయింట్ వద్ద యూరియా పంపిణీని పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

ఖమ్మంవ్యవసాయం: యూరియా పంపిణీని పూర్తిగా ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘా(పీఏసీఎస్)ల ఆధ్వర్యంలోనే చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుతం 40 శాతం మేర డీలర్ల ద్వారా, మిగతా పీఏసీఎస్‌ల ఆధ్వర్యాన పంపిణీ చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం సబ్సిడీపై సరఫరా చేసే యూరియాకు ఈసారి కొరత ఏర్పడగా రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఈనేపథ్యాన పీఏసీఎస్‌ల ద్వారా పంపిణీ చేస్తేనే ఎరువులు పక్కదారి పట్టకుండా పారదర్శకత ఉంటుందని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే, పాలేరు నియోజకవర్గంలో ఇప్పటికే ఈ విధానం అమలవుతుండగా, మిగతా ప్రాంతాల్లోనూ అమలుచేయనున్నారు.

డీలర్లకు నిలిపివేత

ప్రస్తుతం జిల్లాలోని 500 డీలర్లకు యూరియా సరఫరాను పూర్తిగా నిలిపివేయనున్నారు. ఇకపై పూర్తిగా ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల ద్వారా పంపిణీ జరుగుతుంది. పీఏసీఎస్‌లకు దూరంగా ఉన్న గ్రామాల్లో సబ్ సెంటర్లను ఏర్పాటు చేసి యూరియా పంపిణీ చేస్తారు. పాలేరు నియోజకవర్గంలో పైలట్ ప్రాజెక్టుగా అమలవుతున్న ఈ విధానాన్ని జిల్లాలోని 76 పీఏసీఎస్‌ల పరిధిలో అమలుకు నిర్ణయించారు. ఇందుకోసం సహకార సంఘాలకు తోడు మరో 55 సబ్ సెంటర్లు ఏర్పాటు చేస్తారు. మండల వ్యవసాయాధికారి పర్యవేక్షణలో ఏఈఓల ద్వారా కూపన్లు జారీ చేయనుండగా, పీఏసీఎస్‌ల సీఈఓలు, ఉద్యోగులు యూరియా అందిస్తారు.

మరో రెండు వ్యాగన్ల యూరియా

జిల్లాలోని పందిళ్లపల్లి రేక్ పాయింట్‌కు రెండు రోజుల్లో రెండు వ్యాగన్ల యూరియా రానుందని జిల్లా వ్యవసాయాధికారి ధనసరి పుల్లయ్య తెలిపారు. ఒక్కో వ్యాగన్‌లో 2,600 మెట్రిక్ టన్నుల యూరియా ఉంటుందని పేర్కొన్నారు. ఈ యూరియాను ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాలకు సరఫరా చేస్తామని తెలిపారు. కాగా, శుక్రవారం జిల్లాకు 1,333 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందని, ఇందులో ఖమ్మం జిల్లాకు 483, భద్రాద్రి జిల్లాకు 500, మహబూబాబాద్ జిల్లాకు 250 మెట్రిక్ టన్నుల చొప్పున కేటాయించామని వెల్లడించారు.

సీఎం చేతుల మీదుగా అవార్డులు



సీఎం చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న చలపతిరావు, దంతాల సుధాకర్, నాగచందర్‌రావు

జిల్లా నుంచి పలువురు ఉపాధ్యాయులకు అవకాశం

నేలకొండపల్లి: ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేసేలా విద్యార్థులు వచ్చివెళ్లేందుకు సొంత ఖర్చులతో ఆటో సమకూర్చడమే కాక ట్యూటర్ నియమించిన నేలకొండపల్లి మండలంలోని ఆరెగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఇన్‌చార్జ్ ఎంఈఓ బి.చలపతిరావు సేవలకు గుర్తింపు లభించింది. ఆయన కృషిపై ‘బడి బలోపేతానికి బాధ్యతగా..’ శీర్షికన జూలై 6న ‘సాక్షి’లో కథనం ప్రచురితమైంది. ఈ విషయం సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి వెళ్లడంతో శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన ఉపాధ్యాయ దినోత్సవంలో ఆయనను సన్మానించారు. ఈకార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి, విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా తదితరులు పాల్గొన్నారు.

కల్లూరు: కల్లూరు మండలం చెన్నూరు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు దంతాల సుధాకర్ రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక కాగా హైదరాబాద్‌లో అవార్డు అందుకున్నారు.

మధిర : మధిర మండలం దెందుకూరుకు పగిడిపల్లి నాగచందర్‌రావు మంచిర్యాల జిల్లా చెన్నూరు ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నారు. ఆయన రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రిన్సిపాల్‌గా అవార్డు స్వీకరించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడలు తప్పనిసరి

కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి




మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్, పక్కన డీవైఎస్‌ఓ సునీల్‌రెడ్డి

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లాలో సమగ్ర క్రీడాభివృద్ధి సాధించేలా పీడీలు, పీఈటీ, కోచ్‌లు శ్రమించాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సూచించారు. ఇందులో భాగంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించాలని తెలిపారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఆయన పీఈటీలు, పీడీలు, కోచ్‌లతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలల్లో కేవలం చదువుపైనే దృష్టి పెట్టడంతో విద్యార్థులు క్రీడల్లో వెనుకబడుతున్నారని తెలిపారు. శారీరక సామర్థ్యం, ఏకాగ్రత పెరిగేలా జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో వారానికి 150 నిమిషాలు శిక్షణ తప్పనిసరి చెప్పారు. ఈ విషయమై రికార్డులు కూడా నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలకు ఇప్పటికే క్రీడా కిట్లు పంపిణీ చేసినందున మైదానాలను చదును చేయించి శిక్షణ ఇవ్వాలని తెలిపారు. అలాగే, క్లస్టర్, మండల స్థాయిలో క్రీడా పోటీలు నిర్వహిస్తూ విద్యార్థుల్లో పోటీతత్వం పెంచాలని, నైపుణ్యం కనబరిచే వారికి స్టేడియాల్లో ప్రత్యేక శిక్షణ ఇచ్చి రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు పంపాలని సూచించారు. పాఠశాలల్లో తరగతుల వారీగా క్రీడా శిక్షణకు టైంటేబుల్ రూపొందించి, స్పోర్ట్స్ కమిటీలను నియమించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలోడీవైఎస్‌ఓ టి.సునీల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోజూ 30లక్షల మందికి ‘మహాలక్ష్మి’

ఆర్టీసీ కరీంనగర్ జోన్ ఈడీ సోలోమన్



మొక్క నాటిన ఈడీ సోలోమన్‌తో ఆర్‌ఎం, ఉద్యోగులు

సత్తుపల్లిటౌన్: ఆర్టీసీ బస్సుల్లో ప్రతిరోజూ సుమారు 50లక్షల మంది రాకపోకలు సాగిస్తుండగా, మహాలక్ష్మి పథకం ద్వారా 30లక్షల మందికి పైగా మహిళలు ప్రయాణిస్తున్నారని ఆర్టీసీ కరీంనగర్ జోన్ ఈడీ సోలోమన్ తెలిపారు. తద్వారా ఈ పథకం సంస్థకు వరంలా మారిందని వెల్లడించారు. సత్తుపల్లి ఆర్టీసీ డిపోను ఖమ్మం ఆర్‌ఎం ఏ.సరిరామ్‌తో కలిసి శుక్రవారం సందర్శించిన ఆయన మాట్లాడారు. ఉద్యోగులు ప్రయాణికులతో గౌరవంగా వ్యవహరిస్తూ వారి మన్ననలు పొందాలని సూచించారు. ప్రజలను సురక్షితంగా, సౌకర్యవంతంగా గమ్యస్థానాలకు చేర్చడమే లక్ష్యంగా విధినిర్వహణ ఉండాలని తెలిపారు. కాగా, పురుష ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా బస్సు సర్వీసులు నడిస్తున్నామని చెప్పారు. కాగా, డబుల్ డ్యూటీలు ఎక్కువగా వస్తున్నాయన్న డ్రైవర్లు, కండక్టర్ల విజ్ఞప్తితో కొందరు సిబ్బందిని ఔట్‌సోర్సింగ్ విధానంలో తీసుకున్నట్లు ఈడీ తెలిపారు.

సత్తుపల్లి డిపో ఆదర్శం

పరిశుభ్రత, కేఎంపీఎల్, విధి నిర్వహణతో పాటు అన్ని విభాగాల్లో సత్తుపల్లి ఆర్టీసీ డిపో ఆదర్శంగా నిలిచిందని ఈడీ సోలోమన్ తెలిపారు. సమష్టిగా కష్టపడడంతో ఇది సాధ్యమైందని ఉద్యోగులను అభినందించారు. శ్రీరామనవమి సందర్భంగా తలంబ్రాల బుకింగ్‌లో సత్తుపల్లి డిపో రీజియన్‌లో ప్రథమస్థానాన నిలవగా మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ ఎస్.కే.మునీర్‌పాషా, సిబ్బంది కిన్నెర ఆనంద్, జైపాల్‌ను సత్కరించారు. డిప్యూటీ ఆర్‌ఎం వి.మల్లయ్య, డీఎం యు.రాజ్యలక్ష్మి, అసిస్టెంట్ మేనేజర్ విజయశ్రీ, ఎంఎఫ్ సాహితితోపాటు సూపర్‌వైజర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

గణేష్ లడ్డూ.. రూ.1,12,316

తల్లాడ: తల్లాడ మండలం కొత్త మిట్టపల్లి మెయిన్ సెంటర్‌లో నవరాత్రుల పూజలందుకున్న గణనాథుడి చేతిలో లడ్డూ కోసం భక్తులు పోటీ పడ్డారు. గ్రామానికి చెందిన యన్నం శ్రీనివాసరెడ్డి – శ్రీలక్ష్మి దంపతులు 12 కిలోల లడ్డూను మిట్టపల్లి గణేష్ ఉత్సవ కమిటీకి అందజేశారు. శుక్రవారం వేలం వేయగా గ్రామానికే చెందిన నలజాల శ్రీనివాసరావు – సుజాత, ఉదయ్ – సౌమ్య దంపతులు రూ.1,12,316కు దక్కించుకున్నారు.



లడ్డూతో శ్రీనివాసరావు దంపతులు

క్లుప్తంగా

'పార్టీ అనుమతి లేని నియామకాలు చెల్లవు'

ఖమ్మంవైరారోడ్: బీఆర్ఎస్ పార్టీ జిల్లా కమిటీ అనుమతి లేకుండా చేపట్టే నియామకాలు చెల్లవని పార్టీ జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్ ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ అధిష్టానం నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారమే గ్రామ, మండల, జిల్లా కమిటీల నియామకాలు ఉంటాయని వెల్లడించారు. వైరా నియోజకవర్గం కొణిజర్ల, ఏన్కూరు, జూలూరుపాడు మండలాల్లో ఇటీవల కొందరు ప్రకటించుకున్న కమిటీలకు జిల్లా పార్టీ అనుమతి లేదని స్పష్టం చేశారు. నాయకులు, కార్యకర్తలు పార్టీ క్రమశిక్షణ దాటి, అనవసరపు వివాదాలు సృష్టించొద్దని సూచించారు. పార్టీ నిబంధనలకు వ్యతిరేకంగా ఎవరు వ్యవహరించినా చర్యలు తప్పవని మధు హెచ్చరించారు.

కెమిస్ట్రీ అధ్యాపకుడికి డాక్టరేట్


గుగులోతు వీరన్న

ఖమ్మం సహకారనగర్: ఖమ్మంలోని ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాల రసాయన శాస్త్రం అధ్యాపకుడు గుగులోతు వీరన్నకు హైదరాబాద్‌లోని జేఎన్‌టీయూ నుంచి డాక్టరేట్ లభించింది. ప్రొఫెసర్లు వడ్డే రవీందర్, సీహెచ్.వెంకటరమణారెడ్డి పర్యవేక్షణలో ఆయన 'న్యూ పర్స్పెక్టివ్స్ ఇన్‌ట్రాన్షిషన్ మెటల్ క్యాటలిస్టు డిజైన్ సింథసిస్ అండ్ హోమోజీనియస్ ఆక్సిడేషన్ అండ్ ఇపాక్సిడేషన్' అంశంపై పరిశోధనాపత్రం సమర్పించారు. ఈమేరకు కామేపల్లి మండలం మద్దులపల్లికి చెందిన వీరన్న డాక్టరేట్ అందుకోగా, ఎస్ఆర్ఎన్ బీజీఎన్ఆర్ ప్రిన్సిపాల్ మహ్మద్ జకీరుల్లా, అధ్యాపకులు ఏఎల్.శాస్త్రి, ఎం.మాధవరావు, సీహెచ్.సుధాకర్, పి.సర్వేశ్వరరావు, ఎం.సునంద, సత్యవతి తదితరులు అభినందనలు తెలిపారు.

జీఎస్టీ తగ్గింపుతో పేదలకు ఊరట

ఖమ్మం మామిళ్లగూడెం: కేంద్రప్రభుత్వం పలు వస్తువులపై జీఎస్టీ తగ్గించిన నేపథ్యాన పేదలకు లబ్ధి జరగనుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఖమ్మంలోని జీఎస్టీ కార్యాలయం ఎదుట ప్రధాని మోదీ చిత్రపటానికి శుక్రవారం పాలాభిషేకం చేశాక ఆయన మాట్లాడారు. ఢిల్లీలో తాజాగా జరిగిన సమావేశంలో 12శాం, 28శాతం పన్ను స్లాబ్‌లను పూర్తిగా రద్దు చేసి, నిత్యావసర వస్తువులను 5శాతం లేదా సున్నా శాతం జీఎస్టీ పరిధిలోకి తీసుకురావాలని నిర్ణయించినట్లు తెలిపారు. తద్వారా పలు వస్తువుల ధరలు అవకాశముందని కోటేశ్వరరావు చెప్పారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు గెంటెల విద్యాసాగర్, వక్కలంక సుబ్రహ్మణ్యం, మందడపు సుబ్బారావు, జ్వాలా నర్సింహారావు, యార్లగడ్డ రాఘవ, మేకల నాగేంద్ర, మంద సరస్వతి, రజినీరెడ్డి, నాగమణి, రాజేష్, వీరు టేకుమట్ల, కుమిలి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లకు అడ్డొస్తే ఉద్యమం


అభివాదం చేస్తున్న సంఘం నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలుచేయాలన్న నిర్ణయాన్ని ఎవరైనా అడ్డొస్తే ఉద్యమిస్తామని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నారాయణవరపు శ్రీనివాస్ తెలిపారు. ఖమ్మంలో శుక్రవారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జనాభాలో 56శాతం ఉన్న బీసీలకు న్యాయం జరిగేలా అందరూ సహకరించాలని కోరారు. లేనిపక్షంలో ఆయా పార్టీలకు తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణమాచారి మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సంఘం జిల్లా కార్యదర్శిగా మసనం శివరామకృష్ణకు నియామక పత్రాన్ని అందించారు. ఈ సమావేశంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ లింగనబోయిన పుల్లారావు, నాయకులు వెంకటరామయ్య, బొడుకృష్ణ, మోడేపల్లి వెంకటాచారి, రాము , రచ్చ శ్రీనివాసరావు, బండారు శ్రీనివాసరావు, సంపత్, గుడ్ల శ్రీను, సాంబయ్య, వీరభద్రం, మల్లికార్జున్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జనానికి వెళ్లిన యువకుడి గల్లంతు

ముదిగొండ: వినాయకుడి నిమజ్జనానికి వెళ్లిన యువకుడు గల్లంతైన ఘటన ముదిగొండ మండలం మాదాపురంలో శుక్రవారం చోటుచేసుకుంది. మాదాపురం గ్రామానికి చెందిన పడిసల సైదారావు(24) వినాయక శోభాయాత్ర, నిమజ్జనంలో పాల్గొన్నారు. ఆయన మాదాపురం చెరువు వద్ద నిమజ్జనం పూర్తయ్యాక స్నానం కోసం చెరువులోకి దిగాడు. ఈక్రమాన ప్రమాదవశాత్తు గల్లంతవడంతో స్థానికులు ఎంత సేపు గాలించినా సైదారావు ఆచూకీ తెలియ రాలేదు. చీకటి పడడంతో గాలింపు నిలిపివేయగా, పోలీసులు వివరాలు సేకరించారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.19,107

రూ.350 కోట్లతో ప్రతిపాదనలు


రామాలయం


నూతన అభివృద్ధి ప్లాన్‌పై కలెక్టర్‌తో చర్చిస్తున్న ఆర్కిటెక్ట్(ఫైల్)

భద్రాచలం రామాలయ అభివృద్ధికి ప్రణాళిక

- విడతల వారీగా బడ్జెట్ కేటాయించాలని నివేదిక
- రామాలయ కొత్త మాస్టర్ ప్లాన్‌పై వైదిక కమిటీ కినుక..?

భద్రాచలం: భద్రాచల శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ అభివృద్ధికి దేవాదాయ శాఖ రూ.350 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించింది. ఈ మేరకు ఆర్కిటెక్ట్ సూర్యనారాయణ మూర్తి, దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు ప్రాథమిక నమూనా సిద్ధం చేశారు. ఆలయ ప్రాంగణంలోని చిత్రకూట మండపంలో కలెక్టర్ ఆలయ అధికారులతోపాటు వైదిక కమిటీ సభ్యులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అభ్యంతరాలు, సలహాలు, సూచనలను పరిగణనలోకి తీసుకుంటామని వెల్లడించారు. ఆగమశాస్త్ర ప్రకారం ఆలయ అభివృద్ధి ఉంటుందని, ప్రధాన ఆలయంలో మార్పులు లేకుండా ఇతర అభివృద్ధి పనులు చేపతామని పేర్కొన్నారు.

నాలుగు విడతలుగా..

రామాలయం, పరిసర ప్రాంతాల అభివృద్ధి నాలుగు విడతల్లో చేపట్టేలా నూతన నమూనాలో ప్రతిపాదనలు రూపొందించారు. తొలి విడతలో ఆలయ కాంప్లెక్స్ విస్తరణ పూర్తి చేయాలని ప్రతిపాదించారు. మండపాలు, క్యూ హాళ్లు, ప్రసాదం విభాగం, అడ్మినిస్ట్రేషన్ భవనాలు ఉన్నాయి. ఇందుకు రూ. 115 కోట్లు అవసరమని సూచించారు. ఆలయ ప్రాంగణం, పరిసర ప్రాంతాల అభివృద్ధిని రెండో విడతలో ప్రాధాన్యాంశాలుగా పేర్కొన్నారు. ఇందులో విస్తా కాంప్లెక్స్, అడ్మిన్ బ్లాక్, ఘాట్లు, రహదారులు ఉన్నాయి. ఈ పనులను రూ.35 కోట్లతో ప్రతిపాదించారు. మూడో విడతలో కరకట్టకు దిగువ భాగాన ఉన్న కాపా రామలక్ష్మమ్మ భూమిని అభివృద్ధి చేయాలని ప్రతిపాదించారు. ఇది గతంలో ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో ఉండగా, సుదీర్ఘ కాలం కోర్టులో వాదనల అనంతరం రామాలయ సొంతమైంది. ఇందులో రామాయణ మ్యూజియం, తూము నర్సింహాదాసు ఆడిటోరియం, భక్త రామదాసు ప్లాజా, మల్టీ లెవల్ పార్కులు నిర్మించాలని ప్రణాళిక రూపొందించారు. ఇందుకు రూ.100 కోట్లతో ప్రతిపాదించారు. ఆలయ అభివృద్ధితో పాటు పట్టణ అభివృద్ధి పనులకు నాలుగో విడతలో ప్రతిపాదించారు. హోటళ్లు, గిరిజన మ్యూజియం, రామవనం, పట్టణ సుందరీకరణ పనుల చేపట్టేలా పొందుపర్చారు. ఇందుకోసం రూ.100 కోట్లతో ప్రణాళిక రూపొందించారు. ఇలా మొత్తం రూ.350 కోట్లతో ప్రభుత్వానికి నివేదిక పంపారు. దీన్ని సర్కారు ఆమోదించి తగిన బడ్జెట్ విడుదల చేయాల్సి ఉంది.

వైదిక కమిటీ అసంతృప్తి..?

కొత్త మాస్టర్ ప్లాన్‌పై ఆలయ వైదిక కమిటీ అసంతృప్తి వ్యక్తం చేసినట్లు విశ్వసనీయ సమాచారం. ఆర్కిటెక్ట్ సూర్యనారాయణ మూర్తి తమను సంప్రదించకుండానే ప్లాన్ రూపొందించటంపై కినుక వహించినట్లు తెలుస్తోంది. గతంలో చినజీయర్ స్వామి సూచనతో ఆనంద సాయి రూపొందించిన ప్లాన్‌ను వీరు ఆమోదించారు. అయితే ప్రస్తుత ప్లాన్‌పై వీరు అంటీముట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు. మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి భద్రాచలం పర్యటన సమయంలో మాత్రం వైదిక కమిటీ సలహాలు, సూచనలను తప్పకుండా తీసుకోవాలని, వారి ఆమోదం తర్వాతే ప్లాన్‌ను ఖరారు చేయాలని అధికారులను ఆదేశించారు. అయితే వైదిక కమిటీ, పండితులు, దేవాదాయ శాఖ అధికారులు సమష్టిగా ఈ ప్రణాళికను ఆమోదిస్తేనే ఆలయాభివృద్ధి కల సాకారం కానుంది. లేనిపక్షంలో ప్రభుత్వం నుంచి నిధులు విడుదలయ్యే అవకాశమే ఉండదు.

నిమజ్జనానికి ఏర్పాట్లు పూర్తి


కాల్వొడ్డు వద్ద మున్నేటి సమీపానికి వాహనాలు వెళ్లేలా చదును చేయించిన ప్రాంతం

- జిల్లా కేంద్రంలో నేడు గణేష్ శోభాయాత్ర
- ఖమ్మంలో ట్రాఫిక్ ఆంక్షలు, రూట్‌మ్యాప్ ఖరారు

ఖమ్మంక్రైం: జిల్లా కేంద్రంలో ప్రతిష్ఠించిన గణేష్ విగ్రహాలను శనివారం నిమజ్జనం చేయనున్నారు. ఇందుకోసం మున్నేటికి ఇరువైపులా పలు చోట్ల ఘాట్లు ఏర్పాటుచేశారు. ఈనేపథ్యాన శోభాయాత్ర, నిమజ్జనం సాఫీగాసాగేలా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు ఏర్పాటుచేస్తున్నట్లు పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ తెలిపారు. అంతేకాక నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని, గణేష్ శోభాయాత్ర నిర్దేశిత రూట్‌మ్యాప్ ప్రకారమే జరిగేలా చూడాలని సూచించారు. వినాయక విగ్రహాల నిమజ్జనం సందర్భంగా పోలీస్, రెవెన్యూ, మున్సిపల్, ఆర్అండ్‌బీ, వైద్య విద్యుత్‌శాఖల సమన్వయంతో అన్ని ఏర్పాట్లు చేశామని, నిమజ్జనం సకాలంలో జరిగేలా ఉత్సవ కమిటీలు చొరవ తీసుకోవాలని తెలిపారు. అలాగే, శోభాయాత్రలో సౌండ్ సిస్టమ్, డీజేలపై నిషేధం ఉంటుందని, డ్రైవర్లు మద్యం, మత్తు పానీయాలు సేవించొద్దని సూచించారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా అడిషనల్ డీసీపీ ప్రసాద్‌రావు ఆధ్వర్యాన 500 మంది పోలీస్ సిబ్బంది విధులు నిర్వర్తిస్తారని సీపీ తెలిపారు.

శోభాయాత్ర మార్గాలు (ప్రకాశ్‌నగర్ / బొక్కలగడ్డ ఘాట్లకు)

➡ మామిళ్లగూడెం ఏరియా విగ్రహాలను మయూరి సెంటర్, కిన్నెర, జెడ్పీ సెంటర్, చర్చి కాంపౌండ్ మీదుగా చేర్చాలి.
➡ ఆర్టీసీ కార్యాలయం, బ్యాంక్ కాలనీ ప్రాంత గణేష్ విగ్రహాల ఊరేగింపు ఎన్టీఆర్ సర్కిల్, ఇల్లెందు క్రాస్, జెడ్పీ సెంటర్, చర్చి కాంపౌండ్ మీదుగా చేరుకోవాలి.
➡ రోటరీనగర్, ఇందిరానగర్ ప్రాంతం గణేష్ విగ్రహాల ఊరేగింపు మమత క్రాస్, ఇల్లెందు క్రాస్, జెడ్పీ సెంటర్, చర్చి కాంపౌండ్ మీదుగా వెళ్లాలి.
➡ కస్బాబజార్, కమాన్‌బజార్ విగ్రహాల ఊరేగింపును చర్చి కాంపౌండ్ మీదుగా కొనసాగించాలి.
➡ గొల్లగూడెం, శ్రీనగర్ కాలనీ ప్రాంతాల విగ్రహాలను లకారం ట్యాంక్ బండ్ నుంచి, టాటా మోటార్స్, చెరువుబజార్, చర్చి కాంపౌండ్ మీదుగా తీసుకెళ్లాలి.
➡ శ్రీరామ్‌హిల్స్, ముస్తఫానగర్ ప్రాంత విగ్రహాలను ముస్తఫానగర్, చర్చి కాంపౌండ్ మీదుగా తీసుకెళ్లాల్సి ఉంటుంది.
➡ వైరా రోడ్డు ప్రాంతంలోని గణేష్ విగ్రహాల ఊరేగింపు జెడ్పీ సెంటర్, చెరువు బజార్, చర్చి కాంపౌండ్ మీదుగా కొనసాగించాలి.
➡ సారధినగర్ ప్రాంత విగ్రహాలను గాంధీచౌక్, నాయుడు సిల్క్స్, పీఎస్ఆర్ రోడ్, గుంటు మల్లన్న ఆలయం, ట్రంక్ రోడ్, నయాబజార్ మీదుగా తీసుకెళ్లాలి.

రూరల్ మండలం..

➡ నాయుడుపేట, జలగంనగర్, పెద్ద తండా, సాయిప్రభాతనగర్, సాయి గణేష్ నగర్, సూర్యనగర్, కరుణగిరి, రాజీవ్ గృహకల్ప, ఏదులాపురం, ముత్తగూడెం, రెడ్డిపల్లి ప్రాంత విగ్రహాలను నాయుడుపేట వైపు ఏర్పాటు చేసిన మున్నేరు రాంప్ ద్వారా నిమజ్జనం చేయాలి.
➡ ఖమ్మం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధి తీర్థాల, మంగళగూడెం, మద్దివారిగూడెం, పోలిశెట్టిగూడెం, గూడూరుపాడు, తనగంపాడు, కస్నాతండా, కాచిరాజుగూడెం, ఎం.వీ.పాలెం, ఆరెకోడు, ఆరెకోడు తండా, వాల్యా తండా, పిట్టలవారిగూడెం, పోలేపల్లి, గొల్లపాడు, పల్లెగూడెం గ్రామాల్లోని విగ్రహాలను తీర్థాల వద్ద మున్నేటి నిమజ్జనం చేయాలి.

తిరుగు ప్రయాణం

➡ **రూట్ నెంబర్ - 1 :** మున్నేరు నుంచి పంపింగ్ వెల్ రోడ్డు, త్రీ టౌన్ పోలీస్ స్టేషన్, హర్కరా బావి సెంటర్, మూడు బొమ్మల సెంటర్ బోస్ బొమ్మ సెంటర్, చర్చి కంపౌండ్ మీదుగా వెళ్లాలి.
➡ **రూట్ నెంబర్ - 2 :** మున్నేరు నుంచి పంపింగ్ వెల్ రోడ్డు, త్రీటౌన్ పోలీస్ స్టేషన్, హర్కరా బావి సెంటర్, మూడు బొమ్మల సెంటర్, బోస్ బొమ్మ సెంటర్, చర్చి కాంపౌండ్, జెడ్పీ, ఇల్లెందు క్రాస్, ఎన్టీఆర్ సర్కిల్ లేదా మమత సర్కిల్ మీదుగా వెళ్లాలి.
➡ **రూట్ నెంబర్ - 3 :** ప్రకాష్‌నగర్ మున్నేరు నుంచి సెయింట్ జోసెఫ్ సెంటర్, చర్చి కాంపౌండ్ మీదుగా వెళ్లాల్సి ఉంటుంది.

రాకపోకలు నిషేధం

గణేష్ విగ్రహాల నిమజ్జనం పూర్తయ్యేంత వరకు ప్రకాశనగర్ బ్రిడ్జి, కాల్వొడ్డు బ్రిడ్జి మీదుగా అన్నిరకాల వాహనాల రాకపోకలపై నిషేధం ఉంటుంది. ఇక రాపర్తినగర్ – కరుణగిరి బ్రిడ్జి మీదుగా సాధారణ వాహనాలనే అనుమతిస్తారు. అలాగే, మయూరి బ్రిడ్జి మీద నుంచి కూడా రాకపోకలు నిలిపేస్తారు. అంతేకాక నిమజ్జనం సమయాన రాపర్తి నగర్, కొత్త బస్టాండ్, ఎన్టీఆర్ సర్కిల్, మమత సర్కిల్ వైపు వెళ్లే వాహనాలు, నెహ్రూ సర్కిల్ నుంచి ఎఫ్‌సీఐ గోదాంల మీదుగా వాహనాలకు అనుమతి ఉండదు. వాహనదారులు కాల్వొడ్డు, త్రీ టౌన్ పోలీస్ స్టేషన్, మిర్చి మార్కెట్, చర్చి కాంపౌండ్, చెరువుబజార్, జెడ్పీ, ఇల్లెందు క్రాస్ రోడ్డు మీదుగా వెళ్లాలి.

ఎండ మండిపోయింది..

జిల్లాలో శుక్రవారం ఎండ దంచికొట్టింది. నిన్నమొన్నటి వరకు ప్రతిరోజు ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. ప్రస్తుతం వానలు లేకపోగా.. శుక్రవారం ఎండ పెరగడంతో ఉక్కపోత కారణంగా ప్రజలు ఉక్కిరిబిక్కిరయ్యారు. జిల్లాలో సగటున 36 నుంచి 37 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కావడంతో ప్రజలు గొడుగులు, చున్నీలతో వేడి నుంచి రక్షణ పొందడం కనిపించింది. – స్టాఫ్ ఫొటోగ్రాఫర్


ద్విచక్రవాహనంపై గొడుగు పట్టుకుని వెళ్తూ..


ముఖానికి మాస్క్‌తో మహిళ


ఎండలో రక్షణగా చున్నీ


తలపై బస్తా పెట్టుకుని వెళ్తున్న వ్యక్తి

సంత వేలం.. రూ.6.63 లక్షలు

కారేపల్లి సంతకు గత ఏడాది కంటే రూ.1.33 లక్షలు అధికం


అధికారులకు నగదు చెల్లిస్తున్న మహేష్‌బాబు

కారేపల్లి: కారేపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం ప్రాంగణంలో దేవాదాయ ధర్మదాయ శాఖ ఆధ్వర్యాన ప్రతీ ఆదివారం కొనసాగే సంత నిర్వహణను అప్పగించేందుకు శుక్రవారం వేలం నిర్వహించారు. నార్కట్‌పల్లికి చెందిన వెంకటేశ్వర్లు, కారేపల్లికి రాము, పండితాపురం గ్రామానికి చెందిన మేకల మహేష్‌బాబు యాదవ్, రాములు పాల్గొనగా ఏడాది కాలానికి అత్యధికంగా రూ.6.63లక్షలకు పాడిన మహేష్‌బాబు దక్కించుకున్నారు. గత ఏడాది రూ.5.30లక్షలు పలకగా ఈసారి రూ.1.33లక్షలు అధికంగా నమోదైంది. దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, ఆలయ ఈఓ నల్లమోతు శేషయ్య ఆధ్వర్యాన వేలం నిర్వహించగా సంతగుడి మాజీ చైర్మన్ అడ్డగోడ ఐలయ్య, సొసైటీ డైరెక్టర్ డేగల ఉపేందర్‌తో పాటు వాసురెడ్డి సంపత్, మూడ్ మోహన్‌చౌహాన్, జవ్వాజి రంగయ్య పాల్గొన్నారు.

చంద్రగ్రహణం సందర్భంగా ఆలయాలు మూత

ఖమ్మంగాంధీచౌక్: సంపూర్ణ చంద్రగ్రహణం ఆదివారం రాత్రి 9–56 గంటల నుంచి అర్ధరాత్రి 1:26 గంటల వరకు కొనసాగనుంది. ఈనేపథ్యాన జిల్లాలోని ఆలయాలను మూసి ఉంచాలని పండితులు నిర్ణయించారు. ఆదివారం మధ్యాహ్నం 1–30 గంటలకు ఆలయాలను మూసివేసి సోమవారం ఉదయం సంప్రోక్షణ, ప్రత్యేక పూజల అనంతరం భక్తులను దర్శనానికి అనుమతిస్తారు. ఈ విషయాన్ని గమనించాలని ఖమ్మం శ్రీస్తంభాద్రి లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం ఈఓ కొత్తూరు జగన్మోహన్ రావు, అర్చకులు తెలిపారు.

ప్రజలు కలిసొస్తేనే పరిశుభ్రత

కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి


పాఠశాల భవనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, కమిషనర్

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం నగరాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దడంలో ప్రజలు కూడా కలిసిరావాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సూచించారు. ఖమ్మం 57వ డివిజన్‌లో అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ, కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్యతో కలిసి ఆయన శుక్రవారం పర్యటించారు. రమణగుట్ట, దివ్యాంగుల కాలనీ ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీరు, విద్యుత్ సరఫరా, ఖాళీ ప్రాంతాలను పరిశీలించారు. ఖాళీ స్థలాల్లో చెత్త పేరుకుపోకుండా యాజమాలకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఒకవేళ ఎవరైనా స్పందిచకపోతే కేఎంసీ ఆధ్వర్యాన శుభ్రం చేయించి జరిమానా విధించాలని చెప్పారు. అనంతరం దివ్యాంగుల కాలనీలో శిథిలావస్థకు చేరిన బాలకార్మిక ప్రత్యేక పాఠశాలను పరిశీలించిన కలెక్టర్.. సమీపంలోని ఇంగ్లిష్ మీడియం ప్రాథమిక పాఠశాల భవనాన్ని తొలగించి అక్కడ ఆధునికమైన ప్లే స్కూల్, అంగన్‌వాడీ కేంద్రం నిర్మాణంపై ప్రతిపాదనలు సమర్పించాలని ఆదేశించారు. ఇదేసమయాన విద్యార్థుల బోధనకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని తెలిపారు. కార్పొరేటర్ రఫీదా బేగం ముస్తఫా, మున్సిపల్ ఈఈ కృష్ణలాల్, తహసీల్దార్ సైదులు తదితరులు పాల్గొన్నారు.

నేచర్ పార్కులో సౌకర్యాలు కల్పిస్తాం

భద్రాద్రి జిల్లాలో పర్యటించిన పీసీసీఎఫ్ సువర్ణ


నేచర్ పార్క్‌లో వాచ్‌టవర్‌ను ప్రారంభిస్తున్న పీసీసీఎఫ్ సువర్ణ

పాల్వంచరూరల్/ఇల్లెందు రూరల్: ఇల్లెందు కోరగుట్ట చుట్టూ అటవీశాఖ తీర్చిదిద్దిన నేచర్ పార్క్‌లో మరిన్ని సౌకర్యాలు కల్పిస్తామని పీసీసీఎఫ్ (ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్–హెడ్ ఆఫ్ ఫోర్స్) సువర్ణ అన్నారు. మండలంలోని రొంపేడు అటవీ ప్రాంతంలో ప్లాంటేషన్‌ను, కోరగుట్ట వద్ద నేచర్ పార్క్‌ను శుక్రవారం ఆమె సందర్శించారు. కిన్నెరసాని అభయారణ్యం పరిధిలోని రేగళ్ల, ఆళ్లపల్లి, రంగాపురం ఏరియాలను సందర్శించారు. ఆయా ప్రాంతాల్లో ప్లాంటేషన్లు, నర్సరీలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫలాలనిచ్చే మొక్కలు నాటాలని సూచించారు. పార్క్‌లో ఏర్పాటు చేసిన వాచ్‌టవర్‌ను ప్రారంభించారు. శనివారం కిన్నెరసాని డీర్ పార్కు, జలాశయం మధ్యలోని ఆనంద ద్వీపాన్ని సందర్శించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీసీఎఫ్ భీమా నాయక్, డీఎఫ్‌వో కిష్టాగౌడ్, ఎఫ్‌డీఓలు బాబు, కరుణాకరాచారి, ఎఫ్ఆర్ఓ చలపతిరావు, డీఆర్‌వోలు వెంకటరావు, వీరబాబు, ఎఫ్‌బీఓ సుజాత తదితరులు పాల్గొన్నారు.

సాగర్ కాల్వలోకి దూసుకెళ్లిన కారు

- రెండు కి.మీ. మేర కొట్టుకుపోయిన వాహనం
- డ్రైవింగ్ సీటులో ఉన్న వ్యక్తి మృతి




క్రేన్‌తో కారును బయటకు తీస్తున్న దృశ్యం (ఇన్‌సెట్) వెంకటేశ్వర్లు మృతదేహం

ఖమ్మంరూరల్: రూరల్ మండలంలోని గొల్లగూడెం వద్ద శుక్రవారం రాత్రి సాగర్ కాల్వలోకి కారు దూసుకెళ్లగా ఓ వ్యక్తి మృతి చెందాడు. వరంగల్ మార్గం నుంచి ఖమ్మం వస్తున్న కారు అతివేగంగా ఉన్నట్లు తెలుస్తుండగా అదుపు తప్పి కాల్వలోకి దూసుకెళ్లింది. రూరల్ సీఐ ముష్క రాజు, సిబ్బందితో చేరుకుని క్రేన్‌ను రప్పించారు. కాల్వలో ప్రవాహ ఉధృతితో రెండు కి.మీ. మేర కొట్టుకుపోయింది. చివరకు క్రేన్‌తో కారును బయటకు లాగారు.

డోర్లు తెరుచుకోక...

కారు డోర్లు లాక్ అయి ఉండగా అందులోని వ్యక్తి బయటపడే అవకాశం లేకపోయిందని తెలుస్తోంది. కారును బయటకు తీసి అద్దాలు పగులగొట్టే లోగా డ్రైవర్ సీటులో కూర్చున్న వ్యక్తి మృతి చెందాడు. కారు నంబర్ ఆధారంగా పెదతండాకు చెందిన మర్లపాటి వెంకటేశ్వర్లు పేరిట రిజిస్ట్రేషన్ అయిందని గుర్తించారు. మృతి చెందింది యాజమానా, మరొకరా అన్న విషయమై ఆరా తీశాక వెంకటేశ్వర్లుగానే నిర్ధారించారు. సాయిగణేష్ నగర్‌కు చెందిన ఆయన తొర్రూరులో ఫర్టిలైజర్ షాప్ నిర్వహిస్తుండగా అక్కడి నుంచి వస్తూ ప్రమాదం బారిన పడ్డారు. తొలుత కారులో పలువురు ఉన్నారని భావించినా తలుపులు లాక్ అయి ఉండడంతో ఒకరే వస్తున్నట్లు నిర్ధారించి మృతదేహాన్ని పెద్దాస్పత్రికి తరలించారు.

20ఏళ్ల క్రితం ఇక్కడే ప్రమాదం

ప్రస్తుతం ప్రమాదం జరిగినచోటే 20ఏళ్ల క్రితం ప్రైవేట్ బస్సు కాల్వలోకి దూసుకెళ్లింది. పిండిప్రోలు - ఖమ్మం మధ్య నడిచే బస్సులో ఉన్న 25మంది మృతి చెందిన విషయాన్ని స్థానికులు గుర్తుచేసుకున్నారు.

విద్యుదాఘాతంతో వివాహిత మృతి

- పుట్టింటికి వచ్చిన సమయంలో ప్రమాదం

ఖమ్మంక్రైం: ఖమ్మంకు చెందిన వివాహిత విద్యుదాఘాతంతో మృతి చెందింది. ఖమ్మం జిల్లా కేంద్రంలోని శ్రీనివాసనగర్ కాల్వకట్ట ప్రాంతానికి చెందిన సాయిప్రియ(25)కు నాలుగేళ్ల క్రితం సూర్యాపేట జిల్లా మునగాల మండలానికి చెందిన దాసోజు మణికంఠతో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉండగా, అనారోగ్యంతో బాధపడుతున్న బంధువును చూడడానికి గత నెల 29వ తేదీన సాయిప్రియ ఖమ్మం వచ్చింది. ఈక్రమంలో గురువారం సాయంత్రం డాబాపై బట్టలు ఆరవేస్తుండగా ఇనుప తీగకు విద్యుత్ తీగలు తాకడంతో కరెంట్ సరఫరా అయింది. ఈమేరకు షాక్‌కు గురైన ఆమెను తల్లిదండ్రులు పాండురంగాచారి, దుర్గ జిల్లా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఘటనపై కుటుంబీకుల ఫిర్యాదుతో ఖమ్మం త్రీటౌన్ పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు.

రోడ్డుప్రమాదంలో వ్యక్తి...

తల్లాడ: తల్లాడ సమీపాన శుక్రవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డుప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. తల్లాడ చెందిన మాధవరపు సైదులు(36) రామానుజవరం ద్విచక్ర వాహనంపై వెళ్లివస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. స్థానిక శ్మశానవాటిక వద్ద జరిగిన ప్రమాదంలో తీవ్రగాయాల పాలైన ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. సైదులు స్వగ్రామం కోదాడ మండలం కాపుగల్లు గ్రామం కాగా, కొంత కాలంగా తల్లాడలో క్షౌ రవృత్తితో జీవనం సాగిస్తున్నాడు.